అధికారులు సమన్వయంతో పనిచేయాలి



నేతాజీ పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. బాలాజీనగర్ డివిజన్ కేపీహెచ్‌బీ కాలనీ ధనలక్ష్మీ సెంటర్ నేతాజీ పార్కులో పారిశుద్ధ్యం, విద్యుత్, ఇంజినీరింగ్ పనులు పెండింగ్‌లో ఉండటంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సోమవారం ఆయన నేతాజీ పార్కును పరిశీలించారు. ఈ సందర్భం ఎమ్మెల్యే మాట్లాడుతూ..గత కొన్ని నెలలుగా నేతాజీ పార్కులో పనులు అధికారుల జాప్యంతో జరగడం లేదని వాకింగ్ ట్రాక్ సరిగ్గా లేదని, లైటింగ్ లేకపోవటం, గత కొన్ని నెలలుగా పార్కులో పేరుకు పోతున్న చెత్తను తరలించకపోవడంతో దుర్గంధంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులంతా సమన్వయంగా వ్యవహరిస్తూ 15 రోజుల్లో పార్కులోని సమస్యలన్నీ పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సతీష్ అరోరా, ప్రభాకర్ గౌడ్, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

నూతన వైస్ ఛాన్సలర్లకు సన్మానం



గోవర్ధన్, శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న విజయకుమార్ రెడ్డి, వెంకటేశ్వరరావు

కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలో నూతన వైస్ ఛాన్సలర్లను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనివర్సిటీ రెక్టార్ డా. కె. విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు పాల్గొని వైస్ ఛాన్సలర్లు జీఎన్. శ్రీనివాస్, డాక్టర్ ఎ. గోవర్ధన్‌ను సన్మానించారు. శ్రీనివాస్ జేఎన్‌టీయూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా సేవలందించిన అనంతరం పాలమూరు విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. గోవర్ధన్ జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ విభాగంగా సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం ఆర్‌జీయూకేటీ బాసరకు ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విజయకుమార్ రెడ్డి, వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. వీరిద్దరికి విభిన్న పరిపాలన అనుభవం ఉందని, వారు తమ కొత్త బాధ్యతల్లో విశేషంగా కృషి చేస్తారన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో అభివృద్ధి పనులతో పాటు గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులను తక్షణమే చేపట్టాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ కోరారు. సోమవారం కూకట్‌పల్లిలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ఆయన జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి బోయిన్ చెరువు సుందరీకరణలో భాగంగా రిటర్నింగ్ వాల్, సీసీ రోడ్డు, ఐమాక్స్ పోల్స్ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని కోరారు. గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రియదర్శిని హోటల్ నుంచి దుబాయిగేట్ వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించాలన్నారు.



సమస్యలపై వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పేర్కొన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులో తలెత్తిన డ్రైనేజీ సమస్యను సోమవారం ఆయన సీవరేజీ బోర్డు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేట్ మాట్లాడుతూ.. నిజాంపేట్ రోడ్డులో తలెత్తిన డ్రైనేజీ సమస్యను బకెట్ క్లీనింగ్ చేపట్టి పరిష్కరిస్తామన్నారు. మ్యాన్‌హోల్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి మురుగు నీరు సాఫీగా పారేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్పొరేటర్ వెంట సూపర్‌వైజర్ ఓం ప్రకాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకుడు నిరంజన్ గౌడ్, సురేష్ ఉన్నారు.

కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

శేరిలింగంపల్లి: గుల్‌మొహర్‌పార్క్ కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిని సోమవారం కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ ఖాసీం, కాలనీ అసోసియేషన్ నాయకులతో కలిసి విన్నవించారు. వరద నీటి పైప్‌లైన్లు, కాలనీలో దెబ్బతిన్న రోడ్లస్థానంలో సీసీ రోడ్లను నిర్మించాలని, పార్కులోని చిల్డ్రన్స్ ప్లే ఏరియాలో ఇసుకను వేయాలని కోరారు. అనంతరం జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం ఎలక్ట్రికల్ ఈఈని కలిసి పార్కులో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే మంజూరు చేసినట్లు ఖాసీం తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు మోహన్‌రావు, ప్రభాకరాచారి, కమిటీ సభ్యులు షకీల్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చందానగర్ సర్కిల్-21లో రేపటి నుంచి సర్వే



చందానగర్‌లో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు శిక్షణ

చందానగర్: చందానగర్ సర్కిల్ -21 పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే రేపటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం సర్కిల్ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సర్కిల్ 21 పరిధిలో 91,598 ఇళ్లు ఉన్నాయని, ప్రతి 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్, ప్రతి 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారన్నారు. బుధవారం నుంచి ఈ నెల 18 తేదీ వరకు 13 రోజుల్లో సర్వేను పూర్తి చేయాలన్నారు. మొదటి మూడు రోజులలో ఇంటి నంబర్, వివరాలను నమోదు చేసుకొని ఆ ఇంటికి స్టిక్కర్‌ను అతికించాలన్నారు. అనంతరం మిగతా 10 రోజులలో కుటుంబ సభ్యులందరి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులం వివరాలు మార్గదర్శక పుస్తకంలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెవిఎస్ రాజు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, ప్రాజెక్టు అధికారి ఉషారాణి, డీఈలు స్రవంతి, దుర్గా ప్రసాద్, ఏఈలు ప్రతాప్, ప్రశాంత్, సంతోష్‌రెడ్డి, పారిశుధ్య అధికారి శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ, ఎస్ఎఫ్ఏ, ఆర్పీలు, ఎంటమాలజీ, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

అభిషేకాలు.. ప్రత్యేక పూజలు

కార్తీకమాసం మొదటి సోమవారం
కిటకిటలాడిన శివాలయాలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: కార్తీక మాసం మొదటి సోమవారం భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఆలయాల్లో అభిషేకాలు చేసేందుకు బారులుతీరారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ ఆర్‌ఆర్‌నగర్‌లోని శివాలయంలో స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముద్దం మహేష్‌యాదవ్, మన్నే వెంకట్‌యాదవ్, చందుయాదవ్, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన అభిషేకాలు నిర్వహించారు.

అల్లాపూర్, మూసాపేట డివిజన్లలో..

మోతీనగర్: అల్లాపూర్, మూసాపేట డివిజన్లలోని పలు శివాలయాలకు భక్తులు ఉదయం నుంచి తరలివచ్చారు. మూసాపేట డివిజన్‌లోని పాండురంగనగర్, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ఆవరణలోని శివాలయంలో ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. ఉదయం 4.30 గంటలకు గణపతి పూజ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం సామూహిక అర్చనలు చేశారు. అదే విధంగా కబీర్‌నగర్ శివరామాంజనేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అల్లాపూర్ డివిజన్‌లోని వి. రామారావు నగర్, శ్రీ వివేకానందనగర్, పర్వత్‌నగర్‌లలోని పర్వత వర్ధిని శివాలయం, శివబస్తీతో పాటు పలు బస్తీ కాలనీల్లో ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

భరత్‌నగర్ కాలనీలో..

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో సోమవారం కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. ఉదయం 5 గంటల నుంచే ఆలయ అర్చకులు కృష్ణ సూరి సమక్షంలో అభిషేకాలు జరిగాయి. మొదటి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సిద్ధిలింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు

మూసాపేట్‌లో..

మూసాపేట: కార్తీక సోమవారం సందర్భంగా మూసాపేట్‌లోని సిద్ధి లింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.



శివాలయంలో అభిషేకం చేస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్



హరిహర క్షేత్రంలో లింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు



సామూహిక అర్చనలు చేస్తున్న భక్తులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మోతీనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సాయినగర్ 11కేవీ ఫీడర్ పరిధిలోని రవీంద్ర సొసైటీ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాకేష్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు సాయినగర్‌లో కొంత ప్రాంతం, రోడ్డు నెంబర్ 52 నుంచి 60, అయ్యప్ప సొసైటీ పార్కు దగ్గర, బొలినేని అపార్టుమెంట్స్ వద్ద విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

11న భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ఆధ్వర్యంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 11న కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లోని రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడంతో పాటు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కూకట్‌పల్లి, జీడిమెట్ల, సనత్‌నగర్, బీహెచ్‌ఈఎల్ ఖాతాదారులు పాల్గొనవచ్చన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో సత్తా



సందీప్



వివేక్

మూసాపేట: రైఫిల్ షూటింగ్‌లో సత్తా చాటిన కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను ప్రిన్సిపల్ వెంకటయ్య సోమవారం అభినందించారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-19 ఆధ్వర్యంలో సోమవారం గచ్చిబౌలిలో జరిగిన రైఫిల్ షూటింగ్ జిల్లాస్థాయిలో పోటీల్లో కళాశాలకు చెందిన సందీప్ మొదటి స్థానం, వివేక్ రెండో స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ అయ్యప్ప స్వామి ఆలయంలో మహా పడిపూజ కార్యక్రమం కనుల పండుగగా జరిగింది. వేద మంత్రోచ్ఛరణల నడుమ యోగేశ్వర తాంత్రి ఆధ్వర్యంలో హరి గురుస్వామి 18 కలశాల మహా పడిపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాంగణమంతా అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగింది.

విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న సత్యనారాయణ

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్, అవంతినగర్, మోతీనగర్ ఎక్స్‌టెన్షన్‌లో నిర్మించిన శివ రామాంజనేయ దేవాలయంలో ధూప దీప నైవేద్యం, అలంకరణ కోసం భక్తుడు సత్యనారాయణ రూ.లక్ష విరాళాన్ని ఆలయ ప్రధాన సేవకుడు రమేష్ అయ్యంగార్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆలయాల అభివృద్ధికి పాటు పడాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

ఆల్విన్‌కాలనీ: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ కాలనీకి చెందిన రూబినా బేగంకు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా విడుదలైన రూ. 60 వేల చెక్కును సోమవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల పక్షపాతి అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ, ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజు యాదవ్, రవీందర్‌గౌడ్, ప్రసాద్, కాశీనాథ్‌యాదవ్, మల్లేష్ యాదవ్, మల్లేష్ గౌడ్, రాజు యాదవ్, శశాంక్, పవన్, శ్రావణి రెడ్డి పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఘనంగా అలయ్ బలయ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని రాజీవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పాల్గొని మట్లాడారు. ఒకప్పుడు పండగలు అంటే ఎంతో ఉత్సాహం ఉండేదని, ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, సంక్షేమ పథకాల ఊసే లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో రాష్ట్ర ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఎలాంటి ఇబ్బందులు వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.



అలయ్ బలయ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

మెరుగైన వసతుల కల్పనకు కృషి



మేయర్ నీలారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఆల్విన్ మాజీ ఉద్యోగులు, వీర్‌భగత్‌సేవక్ సభ్యులు

నిజాంపేట్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ప్రగతినగర్‌కు చెందిన ఆల్విన్ కంపెనీ మాజీ ఉద్యోగులు, వీర్ భగత్‌సేవక్ సంఘం సభ్యులు సోమవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రగతినగర్‌లో దహన సంస్కారాలు నిర్వహించేందుకు స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వైకుంఠ ధామాన్ని ఏర్పాటు చేయాలని కోరగా మేయర్ సానుకూలంగా స్పందించారు. ఆల్విన్ మాజీ ఉద్యోగులు కృష్ణంరాజు, బలవంత్‌రెడ్డి, నర్సింహులు, సారయ్య, విజయ్ కుమార్, రమేష్, వీర్ భగత్ సేవక్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ, ట్రెజరర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నల్లటి పొగతో ప్రజల అవస్థలు..!

జీడిమెట్ల: జీడిమెట్ల పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ వల్ల పారిశ్రామికవాడకు ఆనుకుని ఉన్న ఎస్ఆర్ నాయక్‌నగర్, అపురూపాకాలనీ, సాయిబాబానగర్, సుభాష్‌నగర్ కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్‌లోకి నేరుగా వస్తున్నది. కార్బన్ పొగ ద్వారా ప్రజలకు తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నిబంధనల ప్రకారం పరిశ్రమల నుంచి వెలువడే పొగను ప్రస్తుతం ఉన్న మాడ్రన్ టెక్నాలజీ అధారంగా గొట్టాల ద్వారానే ఫిల్టర్ చేయాలి కానీ కొన్ని పరిశ్రమల యజమానులు ఇవేమీ పట్టించుకోకుండా విచ్చలవిడిగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇప్పటికైనా పీసీబీ అధికారులు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.



ఉచిత వైద్య శిబిరం



శ్రీనివాసరాజును సన్మానిస్తున్న ఆవుల రవీందర్ రెడ్డి

బాలానగర్: బాలానగర్‌కు చెందిన స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్ శ్రీనివాసరాజు తన జన్మదిన వేడుకలను వినూత్నంగా జరుపుకున్నారు. సోమవారం బాలానగర్‌లోని వినాయక్‌నగర్‌లోని భైరవ స్వామి ఆలయంలో తన సొంత డబ్బులతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో హాజరై వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామన్నారు.ఈ సందర్భంగా శ్రీనివాసరాజును బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సురేందర్ యాదవ్, శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, ఖాజా, రిషి యాదవ్, శేఖర్ గుప్తా, సభాపతి రెడ్డి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కరాటే జట్ల ఎంపిక



జట్ల ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ యూనివర్సిటీలో పురుషులు, మహిళల కరాటే జట్ల ఎంపిక సోమవారం చేశారు. సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ ఎస్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో జట్ల ఎంపిక జరిగింది. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఎల్ఎన్‌సిటీ యూనివర్సిటీ, భోపాల్, మధ్యప్రదేశ్‌లో నవంబర్ 16 నుంచి 20 వరకు జరిగే సౌత్ వెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు.

ఘనంగా సదర్

మోతీనగర్: సదర్ సమ్మేళనాలతో మనుషుల మధ్య సత్సంబంధాలు మెరుగుపడటంతో పాటు ప్రేమాభిమానాలు పెంపొందిస్తాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మూసాపేట డివిజన్ అవంతినగర్ ఈస్ట్ కాలనీలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బండారి సుశీల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదర్ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దున్నపోతుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, నాయకులు బండారి రాజు యాదవ్, బండారి సుశీల్ కుమార్ యాదవ్, బండారి తన్మయి యాదవ్, బండారి ఈశ్వర్‌చంద్ర యాదవ్, బండారి తరుణ్ యాదవ్, బండారి ఉత్తేజ్ యాదవ్ పాల్గొన్నారు.



సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

ట్యాంకర్ కింద పడి మహిళ మృతి

సుభాష్‌నగర్: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు జిల్లాకు చెందిన విష్ణుప్రియ (33), నరసింహారెడ్డి దంపతులు. కొన్నేళ్ల క్రితం సూరారం గ్రామానికి వలస వచ్చి ఉంటున్నారు. వీరు స్థానికంగా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. నరసింహారెడ్డి, విష్ణుప్రియ ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా సూరారం లక్ష్మీనగర్ వద్దకు రాగానే ట్యాంకర్‌ను ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో ఎదురుగా కారు రావడంతో బైక్ అదుపు తప్పి కింద పడిపోయింది. ఈ ఘటనలో ట్యాంకర్ చక్రం కిందపడిన విష్ణుప్రియకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్థానికంగా ఓ నాయకుడు ట్యాంకర్ యజమానితో బేరసారాలు కుదుర్చాడని స్థానికులు ఆరోపించారు. ఈ విషయమై సూరారం పోలీసులను 'సాక్షి' వివరణ కోరగా ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి..

దుండిగల్: మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కోయ్లకుంటకు చెందిన కడమంచి రమేశ్ (35) ప్రమీల దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. రమేశ్ ఎల్ఈడీ బల్బులు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. వారం కిత్రం రమేశ్ కుటుంబంతో వచ్చి సారెగూడెంలోని జీపీఆర్ కాలనీలో గుడిసె వేసుకుని ఉంటున్నారు. ఈ నెల 3న రమేశ్ మద్యం తాగి మూత్ర విసర్జన చేసేందుకు చెట్ల పొదల్లోకి అదుపుతప్పి బోర్లా పడడంతో శ్వాస ఆడక అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా సోమవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి పరిశీలించగా చనిపోయి ఉన్నాడు. మూత్ర విసర్జన చేస్తూ కింద పడిపోయిన దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీలో రికార్డయ్యాయి. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌పై బాణసంచా కాల్చిన కేసులో ముగ్గురి అరెస్ట్

- పాత వీడియోలుగా నిర్ధారణ
- మరో బైక్ కోసం గాలింపు

గచ్చిబౌలి: బైక్‌పై బాణసంచా కాల్చిన కేసులో రాయదుర్గం పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కేటీఎం బైక్‌పై స్టంట్లు చేస్తూ బాణసంచా కాల్చిన వీడియోలు ఇటీవల దీపావళి పండుగకు సంబంధించినవి కావని తేల్చి చెప్పారు. గత సంవత్సరం నవంబర్‌లో జరిగినదని ఆయన తెలిపారు. కేటీఎం బైక్‌పై స్టంట్లు చేసిన ఘట్‌కేసర్‌కు చెందిన షమీర్, ఇన్‌స్టాగామ్‌లో వీడియో పోస్టు చేసిన రామంతాపూర్‌కు చెందిన షాబాజ్, షమీర్ స్నేహితుడు కేటీఎం బైక్ యజమానిని అదుపులోకి తీసుకొని విచారించారు. ముగ్గురిని అరెస్టు చేశారు. గత సంవత్సరం షమీర్ ఇన్‌స్టాగామ్‌లో వీడియోను అప్‌లోడ్ చేశాడు. అదే వీడియోను షాబాజ్ డౌన్ లోడ్ చేసి తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. బైక్‌పై యువకుడు స్టంట్లు చేస్తుండగా వెనుక కూర్చున్న మరో వ్యక్తి టపాసులు కాల్చిన వీడియోను పోలీసులు గుర్తించారు. ఆ వీడియోలో ఉన్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.